క్లుప్తంగా

వరద ప్రాంతాల్లో బీజేపీ నాయకుల పర్యటన


బాధితులతో మాట్లాడుతున్న జేఎన్ సునీత

కోరుట్ల రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి ముంపునకు గురైన అయిలాపూర్‌లోని పలు కాలనీలను బీజేపీ రాష్ట్ర నాయకురాలు జేఎన్ సునీత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుంటుక సదాశివ్, మండల అధ్యక్షుడు పంచిరి విజయ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబల్ల సుదర్శన్, బీజేవైయం నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు


విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్: జిల్లాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం బొమ్మెన శివారులో వర్షాల తాకిడికి నేలవాలిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. వర్షాల సమయంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులుంటే ప్రజలు ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. వీలైనంతా వరకు గృహాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట డీఈ గంగారాం, ఏడీఈ బొప్పరాతి రఘుపతి, ఏఈలు జమీల్‌పాషా, భూమేశ్వర్, దయానందం ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో యువకుల శ్రమదానం


తరగతి గది శుభ్రం చేస్తున్న యువకులు

రాయికల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్, తరగతి గదుల్లో మురికి నీరు, చెత్తాచెదారం చేరింది. ఆదివారం గ్రామంలోని యువజన సంఘ సభ్యులందరూ కలిసి తరగతి గదుల్లో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వీరిని గ్రామస్తులు అభినందించారు.

ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మపురి: పట్టణంలో అన్ని రకాల హంగులతో నిర్మించిన సమీకృత మార్కెట్ ప్రారంభోత్సవం వచ్చే నెల 2వ తేదీన మంత్రి ఈశ్వర్ చేతుల మీదుగా జరగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామయ్యతో పాటు పలువురు కౌన్సిలర్లు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అయ్యోరి వేణుగోపాల్,తరాల్ల కార్తీక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, నాయకులు లక్ష్మణ్, మున్సిపల్ సిబ్బంది నరేశ్ పాల్గొన్నారు.

ఆశ్రమానికి విరాళం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమానికి ఆదివారం దాతలు రూ.12 వేల విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్‌కు అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన బిల్డర్ గాదర్ల రవిగౌడ్-సరిత దంపతులు రూ 5 వేలు, గాజుల రాకేశ్, బోరె రాజశేఖర్, బొక్కల మహేశ్, సిరికొండ రాజ్‌కుమార్ మిత్ర బృందం రూ 4 వేలు, గంప అరుణ-ప్రసాద్ దంపతులు రూ 3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ గ్రామానికి చెందిన బద్రి లక్ష్మణ్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబాన్ని ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్ ఆదివారం కలిశారు. ఆశ్రమంలో పిల్లలకు ఆశ్రయం కల్పించి, పిల్లలకు ఉచిత విద్య అందిస్తామని తెలిపారు.

మోడల్ స్కూల్‌కు వెళ్లేదెలా?

- భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్డు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- నేడు తెరుచుకోనున్న ప్రభుత్వ పాఠశాలలు


వరద నీటిలోంచి వస్తున్న విద్యార్థులు (ఫైల్)


భారీ వర్షాలకు నీటమునిగిన మల్లాపూర్ మోడల్ స్కూల్ రోడ్డు

మల్లాపూర్: భారీ వర్షాలతో మల్లాపూర్ శివారులోని మోడల్ స్కూల్ రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆ రోడ్డు వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లేందుకు రైతులతో పాటు మోడల్ స్కూల్‌కి వెళ్లే ఆధ్యాపకులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం వరుసగా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. భారీ వర్షాలకు మోడల్ స్కూల్ రోడ్డు పూర్తిగా నీటమునిగి ఉధృతంగా ప్రవహించింది. ఇలాగే గత ఏడాది జూలైలో భారీ వర్షానికి మోడల్ స్కూల్ రోడ్డు పూర్తిగా నీటమునగడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, యువకులు, తల్లిదండ్రులే ఆ ప్రవాహంలో వారధులుగా నిలబడి విద్యార్థులను సురక్షితంగా రోడ్డు దాటించారు. 2013లో మోడల్ స్కూల్ ప్రారంభమయినప్పటి నుంచి వానాకాలంలో కురిసే భారీ వర్షాలతో వరద నీటితో రోడ్డు దెబ్బతీనడం.. మళ్లీ తాత్కాలికంగా మరమ్మతులు చేయించడంతోనే అధికారులు సరిపుచ్చుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపక పోవడంతో ఏటా వర్షకాలంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వరద ఉధృతిలో ఆ రోడ్డు వెంట వెళ్లే విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధ్యాపకులు, తల్లిదండ్రులు గత 10 ఏళ్లుగా విన్నవించుకుంటున్న పట్టించుకునే వారే కరువయ్యారు. భారీ వర్షాలకు ప్రభుత్వం ప్రకటించిన సెలవులు ఆదివారంతో ముగుస్తున్నాయి. సోమవారం మోడల్ స్కూల్‌లో చదువుకునే 700 మంది విద్యార్థులతో పాటు పదుల సంఖ్యలో అధ్యాపకులు హాజరుకానున్నారు. కాగా భారీ వర్షాలకు కోతకు గురైన మోడల్ స్కూల్ రోడ్డును ఇప్పటివరకు అధికారులు మరమ్మతులు చేయించలేదు. దీంతో ఆ రోడ్డు వెంట స్కూల్‌కి వెళ్లేందుకు విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏదో విధంగా మోడల్ స్కూల్‌కి పంపితే.. వర్షం పడి మళ్లీ ఆ స్కూల్ రోడ్డు నీటమునిగితే మా పిల్లల సంరక్షణ బాధ్యత ఎవరూ తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ప్రాణనష్టం జరిగితేనే స్పందిస్తారా.. అంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు.

కల్వర్టు లేదా వంతెన నిర్మించాలి



వర్షం వచ్చిన ప్రతిసారీ మోడల్ స్కూల్ రోడ్డు వరదనీరుతో నీట మునిగి రోడ్డు దెబ్బతింటుంది. ఈ రోడ్డుపై నుంచి విద్యార్థులు, అధ్యాపకులు రావడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు కోతకు గురైనప్పుడల్లా చేస్తున్న తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా.. మళ్లీ వర్షం పడితే సమస్య మొదటికి వస్తోంది. కల్వర్టు లేదా వంతెన నిర్మాణం చేపడితేనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– ఎండీ.ఆలీమొద్దీన్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, మల్లాపూర్

రోడ్డు దాటాలంటే భయమేస్తోంది



వానాకాలంలో మోడల్ స్కూల్ రోడ్డు నుంచి వెళ్లాలంటే భయమేస్తుంది. ప్రతీ ఏడాది వర్షం పడ్డదంటే మోడల్ స్కూల్ రోడ్డుపై నుంచి వాననీరు వస్తోంది. తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేస్తే వర్షాలకు కొట్టుకుపోతుంది. శాశ్వత పరిష్కారం చూపాలి.

– గ్రీష్మ, పదో తరగతి

బ్రిడ్జి నిర్మించాలి



వర్షం కురిసినప్పుడల్లా మోడల్ స్కూల్ రోడ్డు నీటమునిగిపోతుంది. ఆ రోడ్డును దాటేటప్పుడు నీటిలో జారి పడిపోతుంటే మా సార్లు పట్టుకుని జాగ్రత్తగా దాటిస్తుండే. మా బాధలు తప్పాలంటే మోడల్ స్కూల్ రోడ్డుపై ప్రభుత్వం, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలి.

– సంజన, పదో తరగతి

వర్షం పడితే సెలవులే..



గత సంవత్సరం జూలైలో మస్తు వర్షాలు పడ్డాయి. అప్పుడు మా మోడల్ స్కూల్ రోడ్డు మునిగిపోయింది. అలా వరుసగా నాలుగైదు రోజులు వర్షం పడ్డది. అప్పుడు మా స్కూల్‌కి లోకల్ హాలీడే ఇచ్చారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– త్రిగున్,పదోతరగతి

విద్యార్థులు కష్టపడి లక్ష్యాన్ని సాధించాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


మెమొంటోలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్: విద్యార్థులు కష్టపడి అనుకున్న లక్ష్యం సాధించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవీ గార్డెన్స్‌లో వాసవీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఎమ్మెల్యే చేతులమీదుగా ఆదివారం ప్రతిభాపురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత, బల్దియా చైర్మన్ గోళి శ్రీనివాస్,మంచాల క్రిష్ణ, పబ్బ శ్రీనివాస్, వాసవి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే,జెడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం

జగిత్యాల రూరల్: వీఆర్ఏలు ప్రభుత్వం పేస్కేలు అమలు చేయడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం హర్షనీయమని వీఆర్ఏలు అన్నారు. పేస్కేలు అమలుపై సంతోషం వ్యక్తం చేస్తూ ఆదివారం వీఆర్ఏలు ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్‌లను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు ద్యాగల గంగరాజం, ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు శంకర్, సుధాకర్, వీరయ్య, స్వామి, గంగాధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో బియ్యం పంపిణీ

రాయికల్: పట్టణంలో వర్షాలతో నష్టపోయిన వంద మంది బాధితులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం బస్తాలను పంపించారు. వర్తక సంఘం ఆధ్వర్యంలో నూనె ప్యాకెట్లు అందించారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై అజయ్‌కుమార్ నిరుపేద బాధితులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్లు కాంతారావు, శ్రీధర్‌రెడ్డి, మహేష్ గౌడ్ ,మహేందర్‌బాబు, సోహైల్ పాల్గొన్నారు.

గ్రామంలో చెత్తను సేకరించిన సర్పంచ్ భర్త


వాడవాడలా చెత్తను సేకరిస్తున్న సత్యం

ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్మికులు కొన్ని రోజులుగా సమ్మె చేస్తుండడంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. మండలంలోని వేములకుర్తిలో ఇదే సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఆదివారం సర్పంచ్ సున్నం నవ్య భర్త సత్యం చెత్త సేకరణకు నడుం బిగించాడు. స్వయంగా ట్రాక్టర్‌తో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి ఆదర్శంగా నిలిచాడు. ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

సీఎం కేసీఆర్ పాలనలో ఇంటింటా లబ్ధి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో ఎమ్మెల్యే

మల్యాల: తెలంగాణలోని అన్నివర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని మల్యాల, బల్వంతాపూర్, కాశీనగర్, పోతారం, కొత్తపల్లి, సర్వాపూర్, లంబాడిపల్లి గ్రామాలకు చెందిన 50 మంది యువకులు, బీఎస్పీకి చెందిన నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డి, జోగు మహిపాల్, కె.మల్లేశం, పి.ప్రశాంత్,ఇబ్రహీం, వినోద్, సునీల్, అంజికుమార్, షేక్ మధు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరుకు కృషి

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని కోనాపూర్ సూరంపేటలో భారీ వర్షాలకు తెగిన రోడ్లను ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరిశీలించారు సంద్రాలపల్లి, చింతలపల్లి బ్రిడ్జిల నిర్మాణానికి మరమ్మతు పనులకు నిధులను మంజూరు చేయించి త్వరలోనే పనులు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ మేనేని రాజనర్సింగరావు. వైస్ ఎంపీపీ పర్లపెల్లి ప్రసాద్ కోనాపూర్ సర్పంచ్ ప్రసాద్, నాయకులు ఏగుర్ల తిరుపతి మలారెడ్డి మహేష్ పులివేంకటేష్ గౌడ్,రాజేశం మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

మండల కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషిచేసిన ఎంపీ అరవింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారయణరావు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డికి రాజేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపాడు.

సంఘమిత్ర యువజన సంఘం అధ్యక్షుడిగా రంజిత్‌రెడ్డి

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర యువజన సంఘం కార్యవర్గంను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలడుగు రంజిత్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జిల్లాల చిన్నామల్లారెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఎద్దండి జితేందర్‌రెడ్డి, కోశాధికారిగా పటేల్ శ్రీకాంత్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా పడిగెల జితేందర్‌రెడ్డి, జిల్లాల నాగరాజు రెడ్డి, కన్నవేణి వేణుగోపాల్‌రెడ్డి,లక్కడి రవీందర్ రెడ్డి ఎన్నుకున్నారు.

ముంపు బాధితులకు న్యాయం చేయాలి

వెల్గటూర్: ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు ఇండ్లు కోల్పోయిన బాధితులకు వెంటనే పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ధర్మపురి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జెల స్వామి డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోయిన చెగ్యాం పునరావాస బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ముంపు బాధిత కుటుంబాలు చేస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిహారం కోసం 19 ఏళ్లుగా అధికారుల చుట్టూ, మంత్రి కొప్పుల ఈశ్వర్ చుట్టూ తిరిగినా ఫలితం లేదని అన్నారు. ఇప్పటికైనా పరిహారం అందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చొప్పదండి సంతోష్, గొల్లపల్లి సంతోష్, కుషనపల్లి దుర్గయ్య, పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను వైద్యుడు మారుతిరెడ్డి ప్రారంభించారు. జావెలిన్ త్రో, వంద, నాలుగు వందల మీటర్ల రన్నింగ్ ఈవెంట్లను నిర్వహించారు. ఈ పోటీల్లో పలు మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అంజయ్య, కొమురయ్య, రామదాసు, రాజేశ్, కార్తీక్ తదితరులున్నారు.

పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పెగడపల్లి: గొల్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్‌లో ఆదివారం పోచమ్మ తల్లి ఎల్లనపుడు వేడుక ఘనంగా నిర్వహించారు. శని, ఆదివారాల్లో గ్రామంలోని అన్ని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేడుకల్లో భాగంగా ఆదివారం డప్పుచప్పుళ్లతో పోచమ్మ తల్లి ఎల్లనంపుడు నిర్వహించి గ్రామస్తులందరూ కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దావు మల్లక్క, ఎంపీటీసీ గోవిందుల లావణ్య, ఉప సర్పంచ్ గుడ్ల నర్సయ్య, వార్డు సభ్యులు, నాయకులు సత్తయ్య, జలపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్‌కు పదవిపై హర్షం

కథలాపూర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి పదవి రావడంపై మేడిపెల్లి, కథలాపూర్ మండలాల బీజేపీ నాయకులు ఆదివారం సంబరాలు జరిపారు. సామాన్య కార్యకర్త నుంచి జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎదిగారని నాయకులు టపాసులు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరండ్ల మధుకర్, మండలాధ్యక్షులు ముంజ శ్రీనివాస్, కంటె సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె


పెగడపల్లిలో కుక్కకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

సారంగాపూర్: తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 25వ రోజుకు చేరింది. సారంగాపూర్‌లో ఆదివారం పంచాయతీ కార్మికులు ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేయగా, బీర్‌పూర్ కార్మికులు మామిడి ఆకులతో తమ సమ్మె 25 రోజుకు చేరిందని భిన్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ విధానం ఎత్తివేయడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు కార్మికులు సిద్ధమయ్యారు.

శునకానికి వినతి..

పెగడపల్లి: పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వానికి మంచి బుద్ధి కలిగించాలని కోరుతూ శునకానికి వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలి

వెల్గటూర్: పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జెల స్వామి అన్నారు. వెల్గటూర్ లో సమ్మె చేస్తున్న పంచాయతీకార్మికులకు సంఘీభావం తెలిపారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే వారితో కలిసి పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలకుర్తి రాజేశం గౌడ్, గొల్లపల్లి సంతోష్, కుషనపల్లి దుర్గయ్య పాల్గొన్నారు.

'సీఎం కేసీఆర్‌కు యువత గుణపాఠం చెప్పాలి'


కాంగ్రెస్‌లో చేరిన యువకులతో సత్యం

మల్యాల: తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన యువతను విస్మరించిన సీఎం కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో యువత తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కటుకం వినయ్ ఆధ్వర్యంలో సుమారు 80మంది యువకులు ఆదివారం మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకుముందుకు స్థానిక బ్లాక్ చౌరస్తా నుంచి అంగడిబజార్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సత్యం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, రాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానాలకు పాల్పడిన యువత భవిష్యత్‌ను సీఎం అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలిస్తామని, యువతకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనంద రెడ్డి, మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంచర్ల లక్ష్మణాచారి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి, రామగిరి మురళీ, బత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వరద బాధితులను పట్టించుకోని ఎమ్మెల్యే'


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సింగరావు

మెట్‌పల్లి: భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు జాడ లేకుండా పోవడం బాధాకరమని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో ఆదివారం పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు వాటిని ఇంతవరకు పరిశీలించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లింగం, అందె మారుతి, బెజ్జారపు శ్రీనివాస్, అబ్దుల్ హఫీజ్, ముఖీమ్ పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని పెద్ద వాగు పరివాహక ప్రాంతంలోని సంగెం రోడ్డులో భారీ వర్షాలకు ఇండ్లు కూలిన బాధితులకు ఆదివారం టీపీసీసీ జువ్వాడి నర్సింగరావు బియ్యం పంపిణీ చేశారు.బాధితులకు తక్షణ సాయం రూ.10 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి


పెద్ద చెరువును పరిశీలిస్తున్న సుజిత్‌రావు

ఇబ్రహీంపట్నం: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని టీపీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో గండి కొట్టిన పెద్ద చెరువును, ఫకీర్‌కొండాపూర్ వెళ్లే లింకు రోడ్డు డైవర్షన్ రోడ్డును, నష్టపోయిన పంటలను పరిశీలించి మాట్లాడారు. వేసవిలో అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు, మామిడి రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ. 10వేలు చెల్లిస్తామని ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మాటలతో చూపిస్తుందని చేతలతో చూపించడం లేదని ఎద్దేవా చేశారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు గండి పడి, చేపలు కొట్టుకపోయి గంగపుత్రులు నష్టపోయారని, వారికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఫిషర్‌మెన్ మండల అధ్యక్షుడు మగ్గిడి నందం, దీపక్‌రాజ్, బైండ్ల శ్రీకాంత్, నల్లూరి సాగర్, దాసరి మోహన్, పాల్గొన్నారు.

మల్లాపూర్: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని రేగుంట, వీవీరావుపేట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. వరదలతో పంటనష్టపోయిన రైతులను, లోతట్టు ప్రాంతాల ప్రజలను కలిసి పరామర్శించారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఫిషనర్‌మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మండల అధ్యక్షుడు రొద్ద రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మల్లాపూర్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ సీనియర్ నాయకుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటి సంరక్షిస్తే గ్రామాలు పచ్చని పల్లెలుగా రూపాంతరం చెంది ప్రగతిపథంలో నిలిస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు ముత్యాల చంద్రశేఖర్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి పుప్పాల మహేశ్, పట్టణ అధ్యక్షుడు లవంగ శివకుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు నాగుల నవీన్, నాయకులు కొండవత్తిని రాజశేఖర్, ముష్కరి రమేష్, ముత్యాల శంకర్, పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు మరువలేనివి

ధర్మపురి: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేశ్ ఆధ్వర్యంలో ఆదివారం సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ముకాస అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేశ్, నాయకులు బండి మురళి, సంగి నర్సయ్య,సంగి ఆనంద్,కస్తూరి మురళి,సంగి శేఖర్,పానుగంటి రవి పాల్గొన్నారు.